


జిసిసి జిఎంగా సంధ్యారాణి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సంధ్యారాణి.. గిరిజన సహకార సంస్థ పరిపాలన విభాగంలో జనరల్ మేనేజర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర జిసిసి పరిపాలన విభాగంలో జనరల్ మేనేజర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరిస్తూ ఇన్చార్జిగా సీతంపేట డిఎం బాధ్యతలు అప్పగించారు. సొంత డిపార్ట్మెంట్ కోఆపరేటివ్ శాఖలో డిప్యూటీ రిజిస్టర్‌గా ఉంటూ పొరుగు సేవల నిమిత్తం జిసిసిలో డిప్యూటేషన్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. డిఎం బాగా పనిచేయడంతో జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు.



ఆర్ఒలను, అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎన్నికలు విజయవంతం

అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినట్టు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పనిచేసిన, సహకరించిన అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టరు అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందిని అభినందిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖతో సహా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేశారని, వారికి శాఖాపరంగా, వ్యక్తిగతంగా అప్పగించిన విధులను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషదాయకమని ఈ ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ప్రతి ఉద్యోగికి అభినందనలు తెలిపారు. మీడియా చక్కటి సహకారాన్ని అందించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి.విష్ణు చరణ్, శుభం బన్సల్, డిఆర్ఒ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వివిరమణ, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, ఎఎస్‌పిలు డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, కలెక్టరు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత కురుపాంలో చోటు

మన్యం నుంచి తొలి టిడిపి మహిళా ఎమ్మెల్యే

రాజులకోట బద్దలు కొట్టిన జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



సరిగ్గా 30 ఏళ్ల తర్వాత తోయక జగదీశ్వరి గెలుపుతో కురుపాం నియోజకవర్గంలో టిడిపికి చోటు దక్కింది. అలాగే తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందిన తొలి మహిళా ఎమ్మెల్యే జగదీశ్వరే. 40 ఏళ్ల రాజుల పాలనకు స్వస్తి పలుకుతూ చిన మేరంగి కోటకు బీటలయ్యే విధంగా 2024 ఎన్నికల్లో జగదీశ్వరి ఎవరూ ఊహించిన విధంగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది కురుపాం నియోజకవర్గం చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించింది. మారుమూల ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ నుంచి తొలి మహిళా ఎమ్మెల్యే గెలుపొందడం విశేషం. ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన జగదీశ్వరి ఎల్విన్‌పేట ఎంపిటిసి గా పని చేస్తూ 2024 ఎన్నికల్లో కురుపాం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983 నుంచి కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు, ఓటములు చూసుకుంటే ఇలా ఉన్నాయి.

అప్పటి నాగూరు, ఇప్పటి కురుపాం నియోజకవర్గంలో ఎక్కువసార్లు కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుస్తూ వచ్చారు. 1983లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన శత్రుచర్ల విజయరామరాజు ప్రత్యర్థి కాంగ్రెస్ ఎస్ అభ్యర్థి పి.సోమందొరపై 623 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1985లో శత్రు చర్ల విజయరామరాజు టిడిపి అభ్యర్థి వెంపటాపు భారతిపై 3941 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి శత్రుచర్ల చంద్రశేఖర్‌రాజు కురుపాం కోటకు చెందిన ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి వైరిచర్ల ప్రదీప్ కుమార్‌దేవ్‌పై 3435 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1994లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయరాజు ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి శత్రుచర్ల చంద్రశేఖర్‌రాజుపై 32,271 ఓట్లతో మొదటిసారిగా ఘనవిజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి శత్రుచర్ల విజయరామరాజు టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజుపై 6917 ఓట్లతో విజయం సాధించారు. 2004లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి కోలక లక్ష్మణమూర్తి ప్రత్యర్థి అయిన టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజుపై 9701 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ విటి జనార్ధన థాట్రాజ్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయరాజుపై 15053మెజార్టీతో గెలుపొందారు. 2014 వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి టిడిపి అభ్యర్థి జనార్ధన థాట్రాజ్‌పై పోటీ చేసి తొలిసారిగా 19083 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 2019 వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి రెండోసారి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జనార్ధన థాట్రాజ్ పై పోటీ చేసి 26602 మెజార్టీతో గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి మూడోసారి పోటీ చేసి ప్రత్యర్థి అయిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరీ పోటీ చేసి ఓటమి చెందారు. 1994, 2024 లో గిరిజన అభ్యర్థులు టిడిపి నుంచి రెండుసార్లు విజయం సాధించగా, 2004లో సిపిఎం గిరిజన అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు.

ప్రతిష్టాత్మకంగా ప్రీజం -10

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ప్రీజం-10 ప్రాజెక్టు కమిటీ సభ్యులు మొలాయ్‌శాన్యల్

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రీజం -10 ప్రాజెక్ట్‌ను పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కమిటీ జిల్లాకు శుక్రవారం విచ్చేసింది. క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్న పరిస్థితిని కమిటీ పరిశీలిస్తుంది. కమిటీ సభ్యులుగా డిఒపిటి డైరెక్టర్ మొలాయ్ శాన్యాల్, బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ (సిపిడి) సుదర్శన్ భగత్ జిల్లాకు చేరుకున్నారు. శనివారం గ్రామాల్లో పర్యటించనున్నారు. తొలుత కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాలో ప్రీజం -10 ప్రాజెక్ట్ అమలు, ఆవశ్యకత, పురోగతి విధానాన్ని వివరించారు. గిరిజన గ్రామాల్లో రక్త హీనతపై అవగాహన, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చేపట్టిన చర్యలపై తెలిపారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యేంత వరకు సచివాలయం సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్‌లతో పాటు ఒక దత్తత అధికారితో ఎనీమియా యాక్షన్ కమిటీ నియమించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించి, అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత లోపం నియంత్రణకు దృష్టి సారించామని చెప్పారు. ప్రిజం -10 కార్యక్రమం ద్వారా మాతా, శిశు మరణాల నియంత్రణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్ష్య సాధన దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా పదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులు మృత్యువాత పడకూడదనే ధ్యేయంతో ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్నామని తెలిపారు. ఎంపిడిఒలు మండల స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని, ఇప్పటికే మంచి మార్పులు గమనించామని, రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించగలమని ఆయన చెప్పారు.

జ్వరాలపై నిరంతర పర్యవేక్షణ : డిఎంఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



కలిగొట్టులో దోమల లార్వా నిరోధక మందు స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

జ్వరాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్‌మోహనరావు ఆదేశించారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన ఎస్.కలిగొట్టులో వైద్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వే, దోమల నియంత్రణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ జ్వర లక్షణాలతో ఉన్న వారికి, కాంటాక్ట్స్‌కు సేకరించిన రక్తపూతల స్లైడ్స్, ఆర్‌డిటి పరీక్షలు పరిశీలించారు. రక్తపూతలను తాడికొండ ఆరోగ్య కేంద్రానికి వెంటనే అందజేసి జ్వర నిర్ధారణ జరపాలని ఆదేశించారు. గ్రామంలో చికిత్స పొందుతున్న ఇద్దరు జ్వర పీడుతులను డిఎంఒ గృహ సందర్శన చేసి వారి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన దోమల నియంత్రణ చర్యలో భాగంగా దోమల లార్వా నిరోధక ఎఎల్ఒ స్ప్రేయింగ్ పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో జ్వరాలను గుర్తించాలని, నిరంతర పర్యవేక్షణ ఉంటూ ఎప్పటికప్పుడు దోమల నియంత్రణా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం భద్రగిరి, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ వైద్యులతో సమీక్షించారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి, ప్రతి రోజూ నిర్వహిస్తున్న జ్వర నిర్ధారణ పరీక్షలు అందులో మలేరియాగా గుర్తించిన వివరాలు పరిశీలించారు. అక్కడ మలేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న వారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విబిడి కన్సల్టెంట్ జి.రామచంద్ర, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, సూపర్వైజర్ శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు ఎస్వీ ప్రకాష్, ఎంటిఎస్ అప్పలనాయుడు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం దోమల నివారణ మందును గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేయించారు. ఈమేరకు దోమల మందు నివారణ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు స్ప్రేయింగ్ దోహదపడుతుందన్నారు. హాస్టల్‌లో అన్ని గదులు, మరుగుదొడ్లలో స్ప్రేయింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ సోకకుండా దోమల మందును పిచికారీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమలో ప్రిన్సిపల్ సంధ్యారాణి, వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి, హెల్త్ అస్టెంట్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన నేతలకు రూ.10తో ఇ- పోస్టులో అభినందనలు

తపాలా శాఖ వినూత్న కార్యక్రమం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఇ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విజయం సాధించిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు హృదయ పూర్వక అభినందనలు తెలిపేలా వారి పదవీకాలానికి శుభాకాంక్షలు తెలియపర్చవచ్చుని, ఇందుకు కేవలం 10రూపాయలు రుసుమ మాత్రమే చెల్లించి తమ దగ్గర ఉన్న ఏదైనా పోస్టాఫీసులో గానీ, సబ్ పోస్టాఫీసులోగానీ ఇ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలపవచ్చని పేర్కొన్నారు. ఈ విధంగా పంపిన సందేశాన్ని నేరుగా మీ అభిమాన నాయకుని చేతికే చేరుతాయని తెలిపారు .

13 న మోడల్ స్కూల్లో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 13న ఈ పాఠశాల వద్ద ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి. రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్లో చేరాలనుకునే విద్యార్థులు వారి అర్హత సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 11 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సందేశాలుంటే పాఠశాల పనిదినాల్లో సంప్రదించాలని తెలిపారు.



విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు మధుసూదనరావు, శంకరరావు

390 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం

ప్రజాశక్తి -కొమరాడ

ధ్రువపత్రాల్లేకుండా విత్తనాలు, పురుగు మందులు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని గుమ్మలక్ష్మీపురం ఎడిఎ మధుసూదన్‌రావు హెచ్చరించారు. మండలంలో పత్తి విత్తనాల అమ్మకాలు చేస్తున్న ప్రైవేట్ దుకాణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీలక్ష్మి నరసింహ ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎటువంటి అనుమతుల్లేకుండా విత్తనాలు అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. దుకాణాల్లో దాడులు చేసిన సమయంలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్ షాపులో 240 కేజీలు పత్తి విత్తనాలు, శ్రీ లక్ష్మీనరసింహ ఫెర్టిలైజర్ షాపులో 150 కేజీల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న విత్తనాలు విలువ సుమారు రూ.10.70 లక్షలు వరకు ఉంటాయని అంచనా వేశారు. ఆ రెండు దుకాణాల్లో స్టాప్ సేల్ చేయడం జరిగిందని వివరించారు. స్వాధీనం చేసుకున్న విత్తనాలకు సంబంధించిన ధ్రుపత్రాలను పూర్తిస్థాయిలో అందజేసిన తర్వాతే అక్కడ అమ్మకాలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు చేయాలంటే తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు సంబంధించిన ధ్రువీకరపత్రాలు ఉంటేనే అమ్మకాలు చేయాలన్నారు. ధ్రువపత్రాల్లేకుండా ఇష్టానుసారంగా అధిక ధరలకు అమ్మకాలు చేస్తే వారిపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల అమ్మకాలు చేసిన వారు తప్పనిసరిగా ధ్రువీకర పత్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని లేకపోతే తర్వాత కేసులు పెట్టే పరిస్థితి ఉందని అన్నారు. కాబట్టి తప్పనిసరిగా రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ధ్రుపత్రాలతో అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పి.శంకర రావు, మక్కువ వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డులు మంజూరు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట



ఉపాధిహామీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నూకలవాడ గ్రామస్తులు

'అయ్యా మేము చాలా పేద వాళ్లాం... మట్టి లోనే ఉంటూ మట్టి పని చేసుకొని బతుకుతున్నాం... మాకు జాబ్ కార్డులు ఎప్పుడు ఇస్తారు.. ఉపాధి పనులు ఎప్పుడు కల్పిస్తారు.. అని అడగని రోజు లేదు... కలవని అధికారి లేరు. ఇదీ మండలంలోని నూకలవాడ ఉప్పర్ల దీనస్థితి.

మండలంలోని నూకలవాడ సుమారు 50 కుటుంబాలు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ జాబ్ కార్డు కావాలని 18ఏళ్ల నుంచి కాళ్లు అరిగేలా తిరిగినా ఫీల్డ్ అసిస్టెంట్, సంబంధిత అధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో సిఐటియును ఆశ్రయించారు. ఈ మేరకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు ఆధ్వర్యాన ఉపాధిహామీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ నూకలవాడలోని ఉప్పర కులస్తులకు జాబ్ కార్డు కావాలని అనేకసార్లు ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడగ్గా పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి హామీ చట్టం వచ్చినప్పటి నుంచి నేటికీ సుమారు 50 కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించలేదు. జాబ్ కార్డులు కూడా ఇవ్వలేదు. ఎప్పుడు అడిగినా చూద్దామంటూ ఇంతవరకు గడిపేశారు. దీంతో గత్యంతరం లేక స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టినట్టు తెలిపారు. ఎపిఒ కేశవరావును జాబ్ కార్డులు కావాలని అడగ్గా తన దృష్టికి ఈ సమస్య ఎప్పుడూ రాలేదని, రెండు రోజుల్లో జాబ్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నక్క సింహాచలం, నక్క కుమారి, దండుపర్తి తిరుపతిరావు, సన్నిబిల్లు రాము, గౌరమ్మ, శ్రీను, పోలురాజు తదితరులు పాల్గొన్నారు.



సంధ్యారాణికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు; జయకృష్ణను సత్కరిస్తున్న అధికారులు

కొత్త ఎమ్మెల్యేలకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి -పాలకొండ

పాలకొండ ఎమ్మెల్యేగా గెలుపొందిన జయకృష్ణకు పెద్దఎత్తున అధికారులు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఆయన సొంత గ్రామమైన ఎం. రాజపురానికి పరుగులు పెడుతున్నారు. మండల స్థాయి అధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు జయకృష్ణను కలుస్తున్నారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ జెడి మన్మధరావు, ఆయన భార్య పంచాయతీ రాజ్ డిఇ రాధాకుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తేజావతి, నాలుగో వార్డు కౌన్సిలర్ గంగునాయుడు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిఇలా ఉండగా పాలకొండ పట్టణంలో జనసేనకు అత్యధిక మెజారిటీ రావడంతో పట్టణంలో కీలక నేతలుగా ఉన్న పల్లా కొండలరావును, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్‌ను ఉమ్మడి పార్టీల కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు.

సంధ్యారాణికి పలువురు శుభాకాంక్షలు

సాలూరురూరల్ : సాలూరులో దశాబ్దన్నర తర్వాత టిడిపి ఎంఎల్ఎ విజయం సాధించడంతో సంధ్యారాణికి పలువురు అభినందనలు తెలిపారు. నియోజకవర్గ రైతు సంఘం నాయకుడు బూస తవుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తాడుతూరి తిరుపతిరావు అభినందనలు తెలిపారు.

నిత్యావసర సరుకులకు జిసిసి టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట



టెండర్లను పరిశీలిస్తున్న పిఒ శుభం బన్సల్

స్థానిక ఐటిడిఎ పరిధిలో గురుకుల పాఠశాలలు, కళాశాలలకు నిత్యవసర సరుకులు కందిపప్పు, బన్సీ రవ్వ, మంచి నూనె, మినప గుళ్లు, గోధుమ నూక తదితర సరుకులు వసతి గృహాలకు సరఫరా చేయడానికి సీతంపేట ఐటిడిఎలో శుక్రవారం పిఒ శుభం బన్సల్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లను పిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంపిల్స్ చూపించిన సరుకులు సరఫరా చేయాలన్నారు. సకాలంలో నాణ్యమైన వస్తువులు పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిడి అన్న దొర, డిఎం జి.సంధ్యారాణి, మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు, ప్రిన్సిపల్ కె.సురేష్‌కుమార్, పి.సూర్యకుమారి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

ఏకలవ్య కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న భామిని, మెలియపుట్టిలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో ప్రదేశాలకు కౌన్సిలింగ్‌ను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మిగిలి ఉన్న సీట్లు మాత్రమే కౌన్సిలింగ్‌ను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్, ప్రిన్సిపల్ కె.సురేష్, ఎం.రాధాకృష్ణ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు


మండలాన్ని వదలని గజరాజులు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలాన్ని గజరాజులు వీడడంలేదు. ఇటీవల కాలంలో కొమరాడ, జియ్యమ్మవలస మండలాల పరిధిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు శుక్రవారం మండల పరిధిలోని నందివానివలస సమీపాన పంట పొలాల్లో సంచరించాయి. అయితే నందివానివలస గ్రామ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో సంచరిస్తుండడంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు అరటి పంటలను పాడు చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పామాయిల్ తోటలోని మోటార్ పైపులను ధ్వంసం చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ రహదారి గుండా వాహనచోదకులు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. కావున తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



నందివానివలసలో సంచరిస్తున్న ఏనుగులు


వెంకంపేటలో స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

స్వీట్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

టిడిపి అభ్యర్థి బోనెల విజయ్‌చంద్ర ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా పార్వతీపురం మండలం వెంకంపేటలో టిడిపి నాయకులు జాగాన భాస్కరరావు స్వీట్ బాక్సులు 400 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్ధతిలో పాలన చేసే ప్రజలు బుద్ధి చెబుతారని ఈ ఎన్నికల్లో రుజువైందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఇస్తారని, ఈ అఖండ విజయం సాధించిన విజయచంద్రకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెంకంపేట టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమరాడలో టిడిపి విజయోత్సవ వేడుకలు

బలిజిపేట: మండలంలోని తుమరాడలో శుక్రవారం జనసేన, టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అరకు పార్లమెంటు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బూరాడ రవి మాట్లాడుతూ ప్రజలు చరిత్రను తిరగరాశారని, రౌడీరాజ్యం నుంచి విముక్తి కలిగించుకున్నారని అన్నారు. ప్రజలు తమ ఉమ్మడి అభ్యర్థుల పార్టీలపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీలు చిత్త శుద్ధితో పనిచేయడానికి మండల స్థాయి నుంచి కష్టపడే పని చేస్తామని అన్నారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు బంకురు పోలినాయుడు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా శత శాతం ఎన్నికల ఫలితాలతో జనసేన దూసుకుపోయిందని 21 స్థానాల్లో విజయం సాధించడం గర్వకారణమని, ఇందుకు సహకరించిన ప్రజలకు ఎప్పుడు మండల కేంద్రం నుండి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలోని 29, 30 వార్డుల్లో ఉన్న రామాపురం కాలనీ, శివాలయం వీధి, పిల్ల వీధుల్లోని కాలువల్లో చేపడుతున్న పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, డిఇ కిరణ్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా మున్సిపాల్టీ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో గల కాలువల్లో పేరుకు పోయిన పూడిక తీత పనులను శరవేగంగా స్తామన్నారు.


రైతులకు దేశీయ విత్తనాలను అందజేస్తున్న ఎఫ్‌పిఒ నూకంనాయుడు

దేశీయ విత్తనాలతో దిగుబడి అధికం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో తోటపల్లి వద్ద గల జట్టు మా భూమి ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) ద్వారా నవ ధాన్య విత్తనాలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 15 మండలాలకు చెందిన రైతులు 8వేల మందికి రూ.29 లక్షల విలువైన 8వేల విత్తన కిట్లను ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అందజేశామని ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎం.నూకం నాయుడు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఈ దేశీయ విత్తనాలు మెట్ట పొలాల్లో వేసుకుని రానున్న ఏడాదికి విత్తనాలు కూడా తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈ దేశీ విత్తనాలు జీడి అరటి, పత్తి, మామిడి తోటల్లో అంతర పంటలుగా వేసుకోవచ్చని ఎన్‌ఎఫ్ఎ జి.అన్నపూర్ణ తెలిపారు.

వైసిపి నాయకులు ఊరు వదిలి వెళ్లిపోవాలి : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాంలో టిడిపి గెలిస్తే కురుపాం వదిలి వెళ్లిపోతామన్న వైసిపి నాయకుల మాటలకు టిడిపి నాయకులు గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం కౌంటర్ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో కురుపాంలో టిడిపి గెలిస్తే కురుపాం నుంచి వెళ్లిపోతానని వైసిపి రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ పత్రికా ప్రకటనలో తెలిపారని గుర్తు చేశారు. కురుపాంలో టిడిపి గెలిచిందని, కావున గోపాల్ ఊరు వదిలి వెళ్లిపోవాలని సూచించారు. వైసిపి పాలనలో కురుపాం నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి జరిగిందని గోపాల్ చెప్పిన మాటల్లో వాస్తవం లేదన్నారు. దోచుకో దాచుకో అనే విధంగా పాలన సాగిందని, మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అభివృద్ధిపై కాస్తంతైనా శ్రద్ధ చూపలేదని అన్నారు. దయచేసి కురుపాం నుంచి వైసిపి నాయకులు బయటికి వెళ్లిపోతే ప్రజల సంతోషంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు కద్రక కళావతి, జానకి తదితరులు ఉన్నారు.

అరకొరగా పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలానికి విద్యా కానుక పాఠ్యపుస్తకాలు అరకొరగా వస్తున్నాయి. ఇప్పటి వరకూ నాలుగో తరగతికి సంబంధించిన పుస్తకాలేవీ రావడంలేదు. ఇప్పటి వరకు 1,2,6,8,9 తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయి. మూడో తరగతికి మూడు టైటిల్స్, ఐదో తరగతికి రెండు టైటిల్స్ పుస్తకాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. నాలుగో తరగతికి సంబంధించి పూర్తిగా పుస్తకాలు రాలేదని, అన్ని తరగతులకు నోటు పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.


మండలానికి చేరుకొన్న అరకొర పుస్తకాలు

నాణ్యమైన దిగుబడులకు

విత్తన దశలోనే జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో విత్తనాలు చల్లుకునేందుకు నారుమడులను రైతులు సిద్ధం చేసుకుంటున్న సమయంలో నారుమడిలోనే సరైన యాజమాన్య పద్ధతులు పాటించగలిగితే మంచి దిగుబడులు సాధించవచ్చునని జిల్లాలోని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పలు సూచనలను రైతులకు వివరించారు.

నారుమళ్ల తయారీ పద్ధతి

రైతులు విత్తనాలు చల్లే ముందు తమ పొలాల్లో దమ్ము చేసి నేలలో కనీసం ఒక మీటర్ వెడల్పుతో పది మీటర్ల వెడల్పు గల భూమిని సిద్ధం చేసుకోవాలి. మడిలోని పోషకాలు కలిగిన నీరు బయటకు పోకుండా పటిష్టమైన గట్లను సమతలంగా ఏర్పాటు చేసుకోవాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడి 10 నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.

జింక్ లోపం నివారణకు చర్యలు

మొలక కట్టిన నారు పూర్తిగా పూలి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇవ్వాలి. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింక్ లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగు గుడ్లను కొనల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు.

విత్తన మోతాదు

నాటే పద్ధతికి 20నుంచి 25 కిలోలు వెదజల్లడానికి విత్తనాలను


విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24నుంచి 30కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16 నుంచి 30 కిలోలు సన్న నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండి జమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండికట్టి మొలకలను దంప నారుమడిలో చల్లు కోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసే కున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్త నాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30 నుంచి 36కిలోల అవసరం ఉంటుంది.

ఎరువుల యాజమాన్యం

నారుమడులు పోయాలనుకున్న భూములకు వేసవి దుక్కులు ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని ఒక కిలో విత్తనం చల్లే ముందు మరో కిలో చల్లిన 12వ నుంచి 14రోజులకు ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు వివరించారు.

విత్తన శుద్ధి

కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండికట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్త నాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవివిజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ శిబిరంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఉయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా వ్యాకరణ పోటీలను నిర్వహించారు. అదేవిధంగా క్రీడాపోటీల్లో భాగంగా చదరంగం, క్యారంబోర్డు తదితర ఆటల పోటీలు నిర్వహించామని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. అదే విధంగా ప్రతిరోజు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అభ్యుదయ రచయిత, ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల కన్వీనర్ భరత్ భూషణ్ రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచంలోనే స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులంతా బాగా చదివి సమాజానికి ఉపయోగపడాలని చెప్పారు. విశ్రాంతి ఉపాధ్యాయుని, సామాజిక కార్యకర్త శాంతిశ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని బాగా వినియోగించుకోవాలన్నారు. సంస్కృత పండితులు బౌరోతు శంకర్రావు మాట్లాడుతూ పుస్తకాలను పోటీతత్వంతో చదివి ఆ జ్ఞానం ద్వారా తాను బాగుపడుతూ పదిమందికి ఆదర్శంగా ఉండాలని తెలిపారు. పిల్లలకు బహుమతి ప్రదానం ముఖ్య అతిథులు అందజేశారు. చిత్ర లేఖనంలో సాయి ప్రణతి, ఉదయ్, భరత్, వ్యాస రచనలో భరత్, ఉదయ్, కావ్య, నృత్యంలో అమృత, హారిక, కార్తీక్, మట్టి బొమ్మల తయారీలో సాయి, భార్గవ్ కుమార్, భరత్, నిఖిల్, ఖోఖో పోటీలో హారిక, కావ్యశ్రీ, ఉదయ్, నవదీప్, గణేష్, భార్గవ్, శృతి ప్రతి రోజూ తప్పకుండా వచ్చిన బాబు గీతిక ప్రణవ్ సాయికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్, పాఠకులు, అభిమానులు పాల్గొన్నారు.



పాలకొండలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ధ్రువపత్రాల్లో అంటివలస పేరు వచ్చేలా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని అంటివలస గ్రామస్తుల దీర్ఘకాల సమస్యలను అటు రెవెన్యూ, ఇటు ఐటిడిఎ, అటవీశాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాయకులు కె.సాంబమూర్తి, రెడ్డి శివున్నాయుడు, వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలసలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. ఈగ్రామస్తులకు రేషన్ కార్డులో పూర్ణపాడు కాలనీ అని ఉందని, కానీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో, విద్యార్థులకు సంబంధించి టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలో దేవుకోన అని పేరు వస్తుంది తప్ప అంటివలస అనే పేరు రావడంలేదని అన్నారు. మ్యాప్‌లో కూడా అంటివలస అనే పేరు రావడంలేదన్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎవరికైనా ఉద్యోగ అవకాశం వస్తే ఊరు పేరు లేకపోతే గ్రామస్తుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఈ గ్రామంలో గిరిజనులు పది ఎకరాలు సాగు చేస్తే 7,8 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. అలాగే ఐదెకరాలు సాగు చేస్తున్న 2, 3 ఎకరాలకు పట్టాలిచ్చారన్నారు. ఇందులో కలెక్టర్, ఐటిడిఎ పిఒ, తహశీల్దార్, ఆర్‌డిఒ సంతకాలు ఉన్నాయి తప్ప అటవీశాఖ అధికారుల సంతకం లేకపోవడం చాలా అన్యాయమని అన్నారు. ఇలా అనేక సమస్యలను గ్రామస్తులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కావున్న జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామం పేరు ధ్రువపత్రాల్లో రావాలని, సాగు చేసిన భూములకు పట్టాలిచ్చి అటవీశాఖ అధికారుల సంతకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో రమేష్, బలరాం, అనిల్‌కుమార్, సురేష్, చిరంజీవి, కూర్మారావు యువకులు పాల్గొన్నారు.

'విషడమ్'లో ఉత్తమ బోధన

ప్రజాశక్తి - పార్వతీపురం

విషడమ్ ఒకేషనల్ కాలేజ్‌లో ఉత్తమ బోధనలు అందించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని కరస్పాండెంట్ కె.రాజేష్, ప్రిన్సిపాల్ బి.ఎల్లంనాయుడు తెలిపారు. ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎల్ఎండి, సిటి కోర్సులతో ప్రథమ ఇంటర్ 67 మంది విద్యార్థులకు 57మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇందులో ఎల్ఎండి కోర్సులో వెన్నెల లత 500 మార్కులకు గానూ 431 మార్కులు, ఎంఎల్‌టి గ్రూపులో వై.భాను ప్రసాద్ 431 మార్కులను, ఎంపిహెచ్‌డబ్ల్యు కోర్సులో ఎం.పద్మ 429 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 400కు పైబడి మార్కులు 17 మంది విద్యార్థులు సాధించారన్నారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధనలు అందిస్తూ, ప్రాక్టికల్ ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ కాలేజ్‌ని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరగా బైపాస్ రోడ్డు ప్రారంభించినట్టు తెలిపారు. వెనుకబడిన ప్రాంతం కావడంతో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే తగ్గించి కేవలం రూ.9వేలు మాత్రమే విద్యార్థులకు ఫీజుపెట్టామన్నారు. పరిమితమైన అడ్మిషన్లు ఉన్నాయని, కావున విద్యార్థులు త్వరగా కాలేజీలో చేరాలని కోరారు.


కాశీ విశ్వేశ్వర ఆలయం పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అడ్డాపుశీలను సందర్శించిన కురుపాం ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశీలలో ప్రఖ్యాతిగాంచిన కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని శుక్రవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా ఆమె గెలుపొందారు. అమరావతిలో టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ మార్గమధ్యలో గల కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఆమె వెంట పార్టీ నాయకులు, బంధువులు, అభిమానులు ఉన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి - భామిని

మండల కేంద్రమైన భామిని ఎస్‌సి వీధిలో మంచి నీటి కుళాయిలు ఏర్పాటుకు టిడిపి నాయకులు లోపింటి అప్పారావు శుక్రవారం రిగ్ కొట్టించారు. పంచాయతీలో నీటి సమస్య లేకుండా పాడైన బోర్లు, బాగుచేసి వాడుకలోకి తెచ్చామని, పాడైన నీటి కుళాయి ట్యాంకు స్థానంలో కొత్త ట్యాంక్ ఏర్పాటు చేశామని, కొత్తగా తీస్తున్న బోరుకు ట్యాంక్ ఏర్పాటు చేసి, కుళాయిలు ఏర్పాటు చేస్తామని పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి లోపింటి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ నాయకులు బిడ్డికి ప్రసాద్ ఉన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై స్థానిక ఎంపిడిఒ ఎస్. రమణయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఉగ్గిన మహేశ్వరరావు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త పూర్తి విచారణ బాధ్యతలను ఎంపిడిఒకు అప్పగించారు. దీంతో ఆయన గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి అప్పన్నదొరపాలెం పంచాయతీ ఆఫీసుకు వెళ్లి రికార్డులన్నీ పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులని వశపరచుకొని తదుపరి విచారణను మంగళవారం నాటికి వాయిదా వేశారు.

జగదీశ్వరికి మంత్రివర్గంలో చోటు?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. నియోజకవర్గ చరిత్రలో 30 ఏళ్ల తర్వాత జగదీశ్వరి ప్రత్యర్థి పాముల పుష్ప శ్రీవాణిపై 23వేలకు పైగా ఓట్లు మెజార్టీతో గెలుపొంది చరిత్ర సృష్టించారు. ఆదివాసీ గిరిజన కుటుంబానికి చెందిన జగదీశ్వరి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పుష్పశ్రీవాణిని చిత్తుగా ఓడించి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల టిడిపి నాయకులు నారా లోకేష్ మంత్రివర్గంలో జగదీశ్వరికి చోట కల్పించే విధంగా సమాలోచనలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఇదే జరిగితే గిరిజన ప్రాంత అభివృద్ధికి మరింత లబ్ధి చేకూరుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. జగదీశ్వరికి మంత్రి పదవి కేటాయిస్తే గిరిజన ప్రాంతం మరింత అభివృద్ధి చెందడానికి వీలుంటుందని గిరిజనులు అంటున్నారు.

మంత్రివర్గంలో ఇద్దరు గిరిజనులకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల గిరిజన జనాభా ఉన్న మేరకు ఇద్దరూ గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రోబ్బ లోవరాజు కోరారు. శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజన సంక్షేమంతో పాటు అటవీ శాఖ కూడా చాలా ప్రాధాన్యత ఉందని, కావున మంత్రివర్గంలో గిరిజన సంక్షేమంతో పాటు అటవీ శాఖ కూడా కేటాయించినట్లయితే ఏజెన్సీ ప్రాంతాలు చాలావరకు అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ మేరకు కాబోయే నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమం, అభివృద్ధికి ఆలోచించి ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు.

వైసిపి నియంత పాలనకు ఓటుతో బుద్ధి

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి చేసిన నియంత పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో కూటమి నాయకులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియంత, అరాచక పాలన చేసిందన్నారు. నియంత పాలనపై ప్రజాగ్రహాన్ని ఎన్నికల్లో చూశామని చెప్పారు. ప్రజా వేదిక కూల్చిన రోజే వైసిపి పతనం ప్రారంభమైందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై లాబీయింగ్ చేయవద్దని నాయకులు, కార్యకర్తలను కోరారు. ప్రజలకు న్యాయం చేసే అధికారులను తెప్పిస్తామని చెప్పారు. పవన్ కళ్యాణ్ త్యాగం మరువలేనిదన్నారు. పట్టణ, గ్రామాల్లో అభినందన సభలు ఏర్పాటు చేయవద్దని కోరారు. బొబ్బిలి నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అభివృద్ధికి పని చేస్తామన్నారు. తాగునీరు, రోడ్లు, కాలువలు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి పొత్తును అవహేళన చేసిన వైసిపికి కూటమిని గెలిపించి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. బిజెపి కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి మాట్లాడుతూ కూటమిపై ప్రజలు విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని, ఆ విశ్వాసాన్ని ఒమ్ము చేయకుండా పని చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పి.మనోజ్ కుమార్, జనసేన నాయకులు లంక రమేష్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

పట్టణంలోని ఐటిఐ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ క్రీడాకారులు కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టిడిపి హయాంలో తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు మంత్రిగా చేసిన సమయంలో నిధులు మంజూరు చేస్తే వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. టిడిపి హయాంలో నిధులు మంజూరై పనులు పూర్తి చేయని పనులపై సెల్ఫీ ఛాలెంజ్‌కు టిడిపి పిలుపునివ్వడంతో ఇండోర్ స్టేడియంపై మొదట సెల్ఫీ ఛాలెంజ్ చేశామన్నారు. సెల్ఫీ ఛాలెంజ్ తర్వాత బుడా నిధులు కొంత కలిపి పనులు ప్రారంభించారు.


సమస్యను బేబినాయనకు వివరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిఒ 117 రద్దుకు కృషి చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

117 జిఒ వల్ల పాఠశాల విద్యారంగానికి జరుగుతున్న నష్టాలను వివరించి రద్దు చేయించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి ఎమ్మెల్యే బేబినానయను కోరారు. శుక్రవారం కోటలో యుటిఎఫ్ డివిజన్ నాయకత్వం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటికే మ్యాపింగ్ చేసిన పాఠశాలలోను విలీనం కాకుండా ఆపాలని కోరారు. ఎమ్మెల్యే బేబినాయన స్పందిస్తూ పూర్తి వివరాలతో ఒక లెటర్ తనకు కావాలని అడిగారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవులకు పలువురి రాజీనామా

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పరాజయం కావడంతో పలువురు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులకు రాజీనామా చేశారు. శుక్రవారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి జనా ప్రసాద్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రేగాన శ్రీనివాసరావు, రహదార్లు భవనాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి నౌపాడ శ్రీనివాస రావు ఇంతక ముందు రాజీ నామాలు చేశారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల

ఆటోలను ఢీకొట్టిన లారీలు

15మందికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో గల ఫ్లైఓవర్ పై వెళ్తున్న ఆటోను వైజాగ్ నుంచి ఒడిస్సా వెళ్తున్న లారీ ఢీకొట్టిన సంఘటన శుక్రవారంఉదయం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ రవీంద్రరాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన వ్యక్తులు ఆటోలో టౌన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఫ్లైఓవర్‌పై నుంచి వస్తుండగా ఒడిస్సా నుండి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు నుజ్జయింది. డ్రైవర్‌తో కలిపి ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి హుటాహుటిన క్షతగాత్రులను జిల్లా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ తెలిపారు.


లారీ ఢీకొని నుజ్జునుజ్జయిన ఆటో

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురం పంచాయతీ జనహిత పాఠశాల సమీపంలో పార్వతీపురం విశాఖపట్నం రహదారిపై ఆటోను లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో పదిమందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సీతానగరం నుండి పార్వతీపురం వస్తున్న ఆటోను అదే రూట్‌లో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో ఆటో బోల్తా కొట్టి పక్కనున్న పొలంలో పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు పది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరందరినీ 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసును రూరల్ పోలీసులు నమోదు చేశారు.